క్లుప్తంగా

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే వివేకానంద్

రంగారెడ్డినగర్: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి, కుత్బుల్లాపూర్, గండిమైసమ్మ– దుండిగల్ మండలాలకు చెందిన 1518 మంది జీవో 58 లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను సోమవారం షాపూర్‌నగర్‌లోని ఎంజీఎస్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలకు పట్టాలు పంపిణీ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మేలు చేసేందుకు తీసుకువచ్చిన జీవో. 58 కింద కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నివాసితులకు మునుపెన్నడూ లేని విధంగా ఈ పథకం ద్వారా శాశ్వత ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు.

భూగర్భ డ్రైనేజీ మరమ్మతులు ఎప్పుడు.?



జీడిమెట్ల: సుభాష్‌నగర్ ఫేజ్–2లో భూగర్భ డ్రైనేజీ మరమ్మతులను అధికారులు, ప్రజాప్రతినిధులు మరిచారు. 2021వ సంవత్సరం సెప్టెంబర్‌లో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు కాలనీలో జనాభా పెరగడంతో భూగర్భ డ్రైనేజీ అవుట్‌లెట్‌లు చిన్నగా మారాయి. మురుగు రోడ్లపై పారుతుండటంతో ఇబ్బంది కలుగుతోందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు గాని ప్రజాప్రతినిధుల గాని పట్టించుకుని భూగర్భ డ్రైనేజీకి మరమ్మతులు నిర్వహించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సీపీఐ పాదయాత్రలను విజయవంతం చేస్తాం

జగద్గిరిగుట్ట: ఏప్రిల్ 14వ తేదీ నుంచి నిర్వహించే పాదయాత్రలను విజయవంతం చేస్తామని సీపీఐ నాయకులు ఉమామహేష్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌లో లక్ష కరపత్రాలు 30వేలకు ఇళ్లకు చేరేలా పాదయాత్ర నిర్వహించి ప్రచారం నిర్వహిస్తామన్నారు. ప్రజలకు సీపీఐ దగ్గరయ్యేలా తమ ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ నిత్యావసర ధరలు అడ్డగోలుగా పెంచుతూ పేదలపై తీవ్ర భారం వేస్తోందని మండిపడ్డారు. దేశంలో మోదీ ప్రభుత్వం ధనవంతులకు దోచిపెడుతూ నిరుపేదల రక్తం తాగుతుందన్నారు. త్వరలోనే జగద్గిరిగుట్టలోని తమ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పాదయాత్రకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను వెల్లడిస్తామని తెలియజేశారు.

రోడ్డు విస్తరణకు శ్రీకారం



మార్కింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: రోడ్డు విస్తరణ పనులపై దుండిగల్ మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. బౌరంపేట నుంచి మల్లంపేట ఔటర్ రింగ్ రోడ్డు వరకు రోడ్డును విస్తరించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 100 అడుగుల మేర రోడ్డును వెడల్పు చేయనున్నారు. సోమవారం దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారి సాయిబాబా సిబ్బందితో కలిసి మార్కింగ్ పనులను పరిశీలించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని సత్యనారాయణ తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నాం

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, వివిధ సంక్షేమ సంఘం నేతలు సోమవారం ఆయనను కలిశారు. పలు సమస్యలను ప్రస్తావిస్తూ వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు..

ప్రశాంతంగా టెన్త్ మొదటి పరీక్ష



విద్యార్థులను చెక్ చేసి పరీక్ష హాలులోకి పంపిస్తూ..



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సోమవారం పదో తరగతి మొదటి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలోని 21 ప్రభుత్వ పాఠశాలలో 1,764 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 9482 మంది టెన్త్ విద్యార్థులు ఉండగా 50 పరీక్ష సెంటలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు 124 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాధికారి ఆంజనేయులు తెలిపారు. పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందే విద్యార్థులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు పోలీస్ సిబ్బందిని గస్తీ ఉంచారు. అదే విధంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎప్పటికప్పుడు ఆయా పాఠశాలలను సందర్శిస్తూ మాస్ కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకున్నారు.



కుత్బుల్లాపూర్‌లోని ఓ పరీక్ష కేంద్రం వద్ద తల్లిదండ్రులతో విద్యార్థులు

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- పరిశ్రమలు, షాపింగ్‌మాల్స్ యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి
- జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి



ఇటీవల ఓ పరిశ్రమలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదం



గంపలబస్తీలో విచ్చలవిడిగా ఉంచిన ప్లాస్టిక్ తుక్కు

జీడిమెట్ల: పరిశ్రమలు, షాపింగ్‌మాల్స్‌లో అగ్నిప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి అన్నారు. జనావాసాలతో రద్దీగా ఉండే షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లలో సిబ్బంది ఎల్లప్పుడు అగ్నిప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సాక్షితో అన్నారు. ప్రతి సంస్థలో అగ్నిప్రమాదాలకు కారణమయ్యే ఎలక్ట్రికల్ పరికరాలు, మండే స్వాభావం కలిగిన రసాయనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ప్రతి పరిశ్రమ, మాల్స్‌లలో ఉన్న ప్యానల్‌బోర్డులు, ఎలక్ట్రికల్ స్విచ్‌లను ఒకసారి ఎలక్ట్రీషియన్‌తో సరిచూసుకోవాలని సూచించారు.

అగ్ని నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలి..

- వాణిజ్యసముదాయాలు, గోదాములు, పరిశ్రమల్లో తప్పనిసరిగా అగ్నినివారణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే నీటిని చిమ్మే పరికారాలు, ఫోండబ్బాలు, కార్బన్‌డాక్సైడ్ సిలిండర్లు, మంటలను ఆర్పే బాల్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి.
- పెద్ద అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే 101కు సమాచారం అందించాలి.

రసాయన పరిశ్రమల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ప్రతి పరిశ్రమలో మండే ప్రభావం కలిగిన రసాయన డ్రమ్ములపై వాటి పేర్లను ఉంచి వాటి స్వభావాన్ని తెలిపేలా రాసి ఉంచాలి.
- రసాయన డ్రమ్ములను ఎక్కడపడితే అక్కడ స్టోరేజీ చేయకుండా తగిన ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతంలోనే వాటిని నిలువ ఉంచేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రతి పరిశ్రమలో పనిచేసే కార్మికులకు రసాయనాలపై అవగాహణ కలిగించాలి. రాత్రిపూట పరిశ్రమల్లో పనిచేసే కార్మికులను గమనించేలా సేఫ్టీటీంను పరిశ్రమలో ఉంచాలి.

తుక్కు గోదాములతో ప్రమాదం..

సుభాష్‌నగర్ గంపలబస్తీలో ఇళ్ల మధ్యలోనే తుక్కు గోదాములను నిర్వహిస్తున్నారు. గత నెలలో జరిగిన రెండు ప్రమాదాల్లో ఓ వ్యక్తి మరణించగా ఇద్దరు కార్మికులు గాయపడ్డారు.

- తుక్కు గోదాముల యాజమానులు నిబంధనలను తుంగలో తొక్కి ఎక్కడపడితే అక్కడ తుక్కును నిలువ చేస్తున్నారు. దీని వలన ఏదైనా అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే తీవ్ర నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదు.

జాగ్రత్తలు పాటించాలి



అగ్ని ప్రమాదాలలో ప్రాణనష్టంతో పాటు ఆస్తినష్టం వాటిల్లుతుంది. ఇవి రెండు కూడా కోలుకోలేని దెబ్బ తీస్తాయి. అందుకే పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తే అగ్నిప్రమాదాలను నిలువరించవచ్చు. ఎండాకాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ప్రతి జాగ్రత్తను తప్పనిసరిగా పాటించాలి.

– సుభాష్‌రెడ్డి, జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్

కేంద్ర, రాష్ట్రాల్లో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



జగద్గిరిగుట్టలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ప్రచారం చేస్తున్న టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

జగద్గిరిగుట్ట: కేంద్ర, రాష్ట్రాల్లో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా 45 రోజు ఆయన జగద్గిరిగుట్ట డివిజన్ లాస్ట్‌బస్టాప్, సోమయ్యనగర్, అంజయ్యనగర్ లలో పర్యటించి కాంగ్రెస్ జెండాలను ఎగురవేశారు. అనంతరం గడపగడపకు హాథ్ సే హాథ్ జోడో అభియాన్ స్టిక్కర్లను అంటిస్తూ కాంగ్రెస్ పార్టీని బలపరచాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఇష్టానుసారంగా ధరలను పెంచుతూ సామాన్య, పేదలపై పెనుభారం మోపుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యాస్ సిలిండర్‌ను రూ.500 అందిస్తామన్నారు. అదే విధంగా విద్యార్థులకు ఫీరీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ గణేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు శ్రీనివాస్‌చారి, వీరారెడ్డి, అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, జేమ్స్, పండరీరావు, ఎండీ అంజాద్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని పరిష్కరించడంలో అధికారులు విఫలం

నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించడంలో జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో బీజేపీ ఆధ్వర్యంలో నీటి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతిరోజు 45 కేఎల్ నీటిని సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 22 కేఎల్ నీటిని మాత్రమే అందిస్తున్నారని అన్నారు. దీంతో బస్తీల్లో తీవ్ర తాగునీటి కటకట నెలకొందన్నారు. ప్రగతినగర్ పరిధిలో క్యాన్ నంబర్ల సమస్యను నెలకొందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో అందిస్తున్న 20 కేఎల్ ఉచిత నీటి సరఫరాను నిజాంపేట్ కార్పొరేషన్‌లో సైతం వర్తింపజేయాలన్నారు. కార్పొరేషన్ అవసరాలకి 10ఎంజీడీ తాగునీరు అవసరముండగా ప్రస్తుతం 4.5 ఎంజీడీ మాత్రమే వస్తోందన్నారు. దీంతో బస్తీల్లో మూడు రోజుల కోసారి కూడా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ఈ వేసవి ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొనకుండా జలమండలి అధికారులు ట్యాంకర్లలో సరఫరా చేయడంతో పాటు, అదనంగా నీటి సరఫరా చేసేందుకు కృషి చేయాలన్నారు. తాగునీటి సమస్యలపై అధికారులు స్పందించకుంటే జలమండలి కార్యాలయాన్ని ప్రజలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అశోక్ నాయక్, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు శేషారెడ్డి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

చిరుధాన్యాలలో విలువైన పోషకాలు



నిజాంపేట్: చిరుధాన్యాలను చిన్నారులకు ఆహారంగా అందిస్తే విలువైన పోషకాలు అందుతాయని ఐసీడీఎస్ మేడ్చల్ జిల్లా ప్రాజెక్ట్ సీడీపీవో కేవీపీ ఉదయశ్రీ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ 6వ డివిజన్‌లోని అంగన్‌వాడీ స్కూల్‌లో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పోషక పక్షం కార్యక్రమాన్ని 15 రోజులుగా నిర్వహిస్తూ వస్తున్నారు. సోమవారం ముగింపు కార్యక్రమానికి సీడీపీవో ఉదయశ్రీ, కార్పొరేటర్లు మార్తా వాణిప్రసాద్, శ్రీరాములు హాజరై చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చిరుధాన్యాలను తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలంటూ గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, మహిళా సంఘాల సీవో మంజుల, ఎస్‌హెచ్‌జీ గ్రూపు లీడర్లు, బాచుపల్లి సెక్షన్ అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది ఝాన్సీ, మహేష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కేంద్రం కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోంది



కిసాన్ మజ్దూర్ యాత్రకు తరలి వెళ్తున్న బాచుపల్లి మండల సీఐటీయూ నాయకులు

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతోందని సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ బాలపీరు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టిన కిసాన్ మజ్దూర్ సంఘర్షణ ర్యాలీ కార్యక్రమానికి సోమవారం బాచుపల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున సీఐటీయూ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బాలపీరు మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్యులపై పెనుభారం మోపిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ సంస్థలకు విక్రయిస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే దేశంలో మతతత్వ శక్తుల అరాచకాలు పెరిగిపోయాయని అన్నారు. నేడు దేశంలో మతాల మధ్య విద్వేషాలు పెచ్చరిల్లుతున్నాయని ఆరోపించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు సాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పెంటయ్య, చెన్నయ్య, వెంకన్న, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా బీసీ అభివృద్ధి శాఖ అధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి చేరవేయడంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ అధికారి టి.ఝాన్సీరాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి అక్రమాలకు చోటివ్వకుండా కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు ఆమె తెలిపారు. కొందరు వ్యక్తులు కావాలని తనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తనపై ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలందించిన 97 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రజావాణికి గతంలో వచ్చినా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలన చేసి పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లిగ్యానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

జగద్గిరిగుట్ట: చింతల్, పద్మానగర్ కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు సాగే ఉత్సవాల్లో భాగంగా సోమవారం పుణ్యావచనం, రక్షాబంధనం, అంకురార్పణ, తీర్థప్రసాద గోష్టి వంటి కార్యాక్రమాలు నిర్వహించారు. ఈనెల 6వ తేదీన 10.30గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరగనున్నట్లు తెలిపారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బాచుపల్లి సీఐ సుమాన్‌కుమార్‌ను సన్మానం

నిజాంపేట్: బాచుపల్లి సీఐగా బాధ్యతలు చేపట్టిన సుమన్‌కుమార్‌ను సోమవారం బాచుపల్లి పాస్టర్ ఫెలోసిప్ సభ్యులు సన్మానించారు. అనంతరం ఈనెల 7న గుడ్ ఫ్రై డేను పురస్కరించుకుని శాంతి ర్యాలీని నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. బాచుపల్లి పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ అబ్రహం, జనరల్ సెక్రటరీ ఎమ్మోస్ రవి రాజా, జాయింట్ సెక్రటరీ జేమ్స్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ స్టీఫెన్ పాల్, క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ మెంబర్ వాణిమ తదితరులు ఉన్నారు.



సీఐను సన్మానిస్తున్న పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు

దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య పోరాటం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 96వ జయంతి సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమరయ్య జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్ 2న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. నిజాం నిరంకుశ పాలన, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అమరుడైన దొడ్డి కొమురయ్య సేవలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సభకు ప్రారంభానికి ముందు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీరాణితో కలిసి డీఆర్‌ఓ జ్యోతి ప్రజ్వలన చేశారు. దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఓ శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, శేఖర్, గొల్ల, కురుమ కుల సంఘాల నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

డంపింగ్ కేంద్రంగా వాటర్‌వర్క్స్ కార్యాలయం

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయం బిల్డింగ్ మెటీరియల్ డంపింగ్‌కు అడ్డాగా మారింది. కార్యాలయానికి అనుబంధంగా పని చేస్తున్న కొంత మంది కాంట్రాక్టర్లు రెండేళ్లుగా కార్యాలయాల ఆవరణలో భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. కాంట్రాక్టర్లు అక్రమంగా డంపింగ్ చేయడంలో కొంతమంది అధికారులు సహకరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వాటర్ వర్క్స్ ప్రధాన కార్యాలయం పరిధిలోని పలు సెక్షన్లలో భూగర్భ డ్రైనేజీ లైన్‌లు, తాగునీటి పైపులైన్‌లను మరమ్మతులు చేపట్టే పనులను 12 మంది కాంట్రాక్టర్లు దక్కించుకున్న విషయం తెలిసిందే.

- అందులో భాగంగా కాంట్రాక్టర్లు వినియోగించే ఇసుక, కంకర, ఇటుకలు తదితర వస్తు సామగ్రిని కాంట్రాక్టర్ల తమ స్థలాల్లో భద్రపరచుకొని పనిచేసే చోటకు తీసుకువచ్చి మరమ్మతులు చేపట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. కానీ కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ డివిజన్ పని చేస్తున్న కొంతమంది కాంట్రాక్టర్లు అక్రమంగా రెండేళ్లుగా ఇసుక, కంకర, ఇటుకలు, డస్ట్‌ను డంప్ చేస్తున్నారు.
- కాంట్రాక్టర్లు ఇలా డంప్ చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో కార్యాలయ ఆవరణలో అక్రమంగా డంప్ చేస్తున్న మెటీరియల్‌ను తరలించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పినా కాంట్రాక్టర్లు పెడ చెవిన పెడుతున్నారు. ఇదంతా అధికారుల అండ చూసుకునే అని వినియోగదారులు చెబుతున్నారు.



కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణలో డంప్ చేసిన ఇసుక, ఇటుకలు, డస్ట్





